క్లుప్తంగా

116 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: అనారోగ్య సమస్యలు గల వారు వైద్య సేవలు పొందడంతోపాటు ఆరోగ్య సూచనలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. కొరువాడ జగన్నాథపురంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 116 మందికి ఓ.పి ద్వారా వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగులకు ఇళ్లకు వెళ్లి ఎనిమిది మంది వైద్యం అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, రమణ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీవో స్పందనలో 31 ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై 31 అర్జీలు వచ్చాయి. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆర్డీవో హెచ్‌వి.జయరాం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నర్సీపట్నం మండలం ఓఎల్.పురం గ్రామానికి చెందిన పేదలు తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ సర్పంచ్ బంటు నాగరాజుతో కలిసి వినతి సమర్పించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు, పింఛన్లు, రేషన్‌కార్డులు, భూ సంబంధిత సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. వీటిని సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో మండల స్థాయి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనం

రోలుగుంట: కొవ్వూరులో ఈ నెల 25న ప్రారంభమైన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. శనివారం చిన తీర్థం, ఆదివారం పెద్ద తీర్థం జరిగాయి. సోమవారం ఉత్సవమూర్తులను మేళతాళాలతో స్థానిక బీటీరోడ్డు పక్కన చెరువు వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ, రోలుగుంట పీఏసీఎస్ డైరెక్టర్ బాబూరావు, ఉప సర్పంచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలికి ఘన సన్మానం



సుబ్బారెడ్డి, మంత్రుల సమక్షంలో అనురాధను సన్మానిస్తున్న దృశ్యం

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన ఈర్లె అనురాధ ఘన సత్కారం అందుకుంది. సోమవారం కె.కోటపాడులో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపిక అందించారు.

ఆరోగ్య రికార్డుల తనిఖీ



ఆరోగ్య రికార్డులను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్న ఎంపీహెచ్ఈవో

రోలుగుంట: గ్రామ సచివాలయ ఏఎన్ఎంలతో సోమవారం బుచ్చింపేట పీహెచ్‌సీలో వైద్యాధికారి సునీత సమీక్షించారు. రోగులకు అందించిన సేవలు, గ్రామాల్లో నమోదవుతున్న రోగాలు, తదితర ఆరోగ్య రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వీధుల్లో చెత్తకుప్పలు గుర్తిస్తే పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల వద్ద, కాలువలో మురుగు నిల్వలు లేకుండా ప్రజల్లో అవగాహన అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయాల వారిగా సహాయ ఏఎన్ఎంల ఆరోగ్య రికార్డులను కంప్యూటర్‌లో ఎంపీహెచ్ఈవో అప్పలనాయుడు నిక్షిప్తం చేశారు.

మేనిఫెస్టోలో లేకున్నా సంక్షేమ పథకాలు

- అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే
- వెనుకబడిన వర్గాల వారికి గుర్తింపు
- మాడుగుల నియోజకవర్గ స్థాయి పార్టీ సమీక్షలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి



పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డికి వేంకటేశ్వరుడి విగ్రహం బహూకరించి సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కె.కోటపాడులో సభకు హాజరైన నాలుగు మండలాల నుంచి వేలాది మంది కార్యకర్తలు, మహిళలు

కె.కోటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో లేని హామీలను అమలు చేసి ప్రజలకు మేలు చేశారని రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన సోమవారం కె.కోటపాడులో మాడుగుల నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో వైఎస్. జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో 3,648 కిలోమీటర్లు నడిచి అన్ని వర్గాల ప్రజల ఇబ్బందులను గుర్తించారన్నారు. ప్రజల, భగవంతుని దయతో సీఎం పదవి చేపట్టిన నాటి నుంచి అనుక్షణం మంచి చేయాలన్న తపనతో సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని ప్రశంసించారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు, పచ్చచొక్కాల నాయకులు దోచుకోవడం తప్ప చేసిందేమి లేదని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీరు వ్యవస్థ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగాలు, పైసా అవినీతికి తావులేకుండా నేరుగా అర్హులకే సంక్షేమ లబ్ధిని అందిస్తున్నట్లు వివరించారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేని టీడీపీ నేతలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్ల కాలంలో అందించిన సంక్షేమాన్ని వివరించడంతోపాటు ఇంకా అర్హత ఉంటే వారికి ఆయా పథకాల లబ్ధిని చేకూర్చాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను 2019 ఎన్నికల కంటే రెట్టింపు మెజార్టీతో గెలిపించి జగన్‌ను మరో మారు ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అదేవిధంగా వచ్చే నెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాడుగుల నియోజకవర్గంలోని ఆరు వేల పట్టభద్రుల ఓటర్లు పార్టీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు.

వివక్ష లేకుండా ఇస్తున్నాం...: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

సీఎం జగన్ పాలనలో ప్రజలకు వివక్ష చూపకుండా పార్టీ, కులం, మతం అన్న తేడా లేకుండా సంక్షేమ లబ్ధిని అందిస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్తున్నప్పుడు సంక్షేమ లబ్ధితోపాటు సీఎం జగన్ పాలనను గొప్పగా చెబుతుండడం ఆనందం కలిగిస్తుందన్నారు. ఈ సంక్షేమ పాలనే వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూడలేక తెలుగుదేశం పార్టీ నాయకులు అభద్రతా భావంతో వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు నియోజకవర్గ పార్టీ శ్రేణులు అహర్నిశలు కృషి చేయాలని కోరారు.

ప్రతి పేదోడికి సంక్షేమ పాలన తెలుసు: మంత్రి అమర్‌నాథ్

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో ఏమి చేశారో ప్రజలను, పేదవాడిని అడిగితే టీడీపీ నాయకులకు తెలుస్తుందని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గ్రామాల్లో చేపట్టిన సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్, లింక్ రోడ్లు, సీసీరోడ్ల నిర్మాణం అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. మాడుగుల నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం బూడిని ఢీకొట్టే నాయకుడు ఇతర పార్టీల్లో కనుచూపు మేరలో లేరన్నారు. వచ్చే నెల నుంచి ప్రారంభమయ్యే జగనన్న మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీ బి.వి.సత్యవతి మాట్లాడుతూ సీఎం జగన్ పేదల కుటుంబాల్లో సంక్షేమ వెలుగులను నింపి పేదరికం దూరం చేశారని ప్రశంసించారు. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ అందరికీ సంక్షేమాన్ని అందకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు అలవాటు అని విమర్శించారు. అనంతరం పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించి వేంకటేశ్వరస్వామి ఇత్తడి ప్రతిమను బహూకరించారు. కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి వేలాది మంది కార్యకర్తలు, మహిళలు తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయి సందడిగా మారింది. జెడ్పీ ఛైర్మన్ జల్లిపల్లి సుభద్ర, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, మాడుగుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు, పార్టీ గ్రీవెన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ జిల్లా మహిళా, రైతు విభాగాల అధ్యక్షులు ఈర్లె అనురాధ, యర్రా అప్పారావు, ఎంపీపీలు రెడ్డి జగన్‌మోహన్, కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, కురచా జయమ్మ, వేమవరపు పెదబాబు, జెడ్పీటీసీలు కర్రి సత్యం, లాలం శారదా జానకీరామ్, దేముడమ్మ, నాలుగు మండలాల పార్టీ మండలాధ్యక్షులు తాళ్లపురెడ్డి రాజారామ్, బూరె బాబూరావు, దాట్ల శివాజీరాజు, గొర్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడికి కేసు నమోదు

చోడవరం రూరల్: అడ్డూరు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బొడ్డేడ సతీష్ శ్రీనివాస్‌పై దురుసుగా ప్రవర్తించిన యలమంచిలి పోతునాయుడుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.అప్పలనాయుడు సోమవారం తెలిపారు. శనివారం సచివాలయ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు చోడవరం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగి నిందితుడిపై ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనాదీన భూముల నివేదిక ఇవ్వాలని ఆదేశం



వీఆర్వోలతో సమావేశమైన తహసీల్దార్ వెంకటేశ్వరరావు

రోలుగుంట: గ్రామాల్లో అనాదీన భూములను గుర్తించి వాటి నివేదికలు తయారు చేసి అందజేయాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ వారీగా అసైన్డ్‌భూములు, గెడ్డ పోరంబోకు, గోర్జులు తదితర ప్రభుత్వ భూములు(అనాదీనం)ను ఎవరెవ్వరూ అనుభవిస్తున్నారన్న వివరాలపై చర్చించారు. వెంటనే అటువంటి వారి సమాచారం తయారు చేసి నివేదికలు అందజేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ హెచ్.త్రివేణి, ఆర్ఐ రామ్మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు దంపతులు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు కలశాలతో నీటిని తీసుకొచ్చి అభిషేకించారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ప్రభావతి దంపతులు పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకటనారాయణమూర్తి, కోశాధికారి పడాల అప్పలనర్సయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, గోకాడ లక్ష్మీరావు, ఉప సర్పంచ్ రాజేశ్ పాల్గొన్నారు. బుధవారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు మూర్తి తెలిపారు. విశాఖ నగరంలోని సుజాతనగర్‌కు చెందిన చర్ల సత్యనారాయణ శర్మ, సత్య కాశీ అన్నపూర్ణ దంపతులు సారధ్యంలో ఈ కార్యక్రమము ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

అసనగిరి, కొత్త సిరిపురంలో పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదన

నాతవరం ఎంఈవో తాడి అమృత్‌కుమార్



నాతవరం: కొండలపైన గిరిజన గ్రామాలైన అసనగిరి కొత్త సిరిపురంలో ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేక గిరిజన పిల్లలు పడే ఇబ్బందులను ఇటీవల కలెక్టరు పర్యటనలో స్వయంగా చూశారన్నారు. ఆయన ఆదేశాలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. సుందరకోట పాఠశాలకు నాడు – నేడు రెండో విడతలో మంజూరైన రూ. 42 లక్షలతో నూతన భవన నిర్మాణాలు ప్రారంభించామన్నారు. రైతు వెంకయ్య పాలెం, ఎ.శరభవరం పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించేందుకు రూ. 42 లక్షలు చొప్పున, పి.జగ్గంపేటలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనం నిర్మాణానికి రూ. 16 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ పనులు చేయకపోతే ఆ నిధులు ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేస్తామన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు 586 మంది విద్యార్థులు రాస్తారని, నాతవరంలో ఒకటి, యర్రవరంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

1న ముకుందపురంలో సీతారాములు తీర్థం

మాడుగుల రూరల్: ముకుందపురంలో ఈ నెల ఒకటో తేదీన సీతారాములు తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ పెమ్మే వెంకునాయుడు, సర్పంచ్ కర్రి గణేశ్, ఉప సర్పంచ్ టి. శివకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ముగ్గులు, బైక్ స్లో పోటీలు, మధ్యాహ్నం క్విజ్ పోటీలు, సాయంత్రం కె.జె.పురం వారి శ్రీకృష్ణ కోలాటం నిర్వహించనున్నామన్నారు.

ఘనంగా కర్రి రామునాయుడు తీర్థం

కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం వెళ్లే రహదారిలో కర్రి రామునాయుడు విగ్రహం వద్ద తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆయన కుటుంబ సభ్యులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడి అరెస్ట్

కశింకోట: సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పాన్ షాపుపై దాడి చేసి నిర్వాహకుడిని పట్టుకున్నట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి సోమవారం తెలిపారు. ఈ దాడిలో పది క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కె.రాజును అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

రాయితీ యంత్ర పరికరాలకు నేడే ఆఖరు



ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రాయితీపై అందిస్తున్న యంత్ర పరికరాలను పొందేందుకు మంగళవారంతో గడువు ముగుస్తుందని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాలకుగాను ఇప్పటికే 13 ఆర్బీకేల్లో సీహెచ్‌సీ గ్రూపులకు ఇప్పటికే రాయితీ యంత్ర పరికరాలు అందజేశామన్నారు. తారువ, ఎం. అలమండ, కలిగొట్ల, తెనుగుపూడి, మామిడిపల్లి, పెదనందిపల్లి, కాశీపురం ఆర్బీకేల పరిధిలోని సీహెచ్‌సీ గ్రూపులకు అందించాల్సి ఉందన్నారు. ఈ పథకం ద్వారా సీహెచ్‌సీ గ్రూపు రైతులకు రూ.15 లక్షలు విలువ చేసే యంత్ర పరికాలు అందజేస్తామన్నారు. వీటిలో రూ.7.50 లక్షలు గ్రూపు సభ్యులు చెల్లించాలని, రూ. 7.50 లక్షలు బ్యాంక్ రుణంగా అందజేస్తారన్నారు. యంత్రలు పరికాలు అందజేసిన తర్వాత 40 శాతం ప్రభుత్వ సబ్సిడీని గ్రూపు సభ్యుల ఖాతాలో జమ చేస్తారన్నారు. ఈ ఏడు ఆర్బీకేల పరిధిలోని సీహెచ్‌సీ గ్రూపుల సభ్య రైతులు ఈ నెల 28వ తేదీలోపు డీసీసీబీలో యాభై శాతం సొమ్ము డిపాజిట్ చేస్తే అర్హులుగా పరిగణిస్తారన్నారు. ఈ పథకం ద్వారా దుక్కు, దమ్ము సెట్లు, ట్రాక్టర్లు, రోటోవేటర్స్, పవర్ టిల్లర్స్, మల్టీ క్రాప్ కటర్స్ తదితర యంత్ర పరికాలను అందజేస్తారన్నారు.

రీ సర్వేతో సమస్యల పరిష్కారం



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ కనకారావు

మాకవరపాలెం: జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో చేపట్టిన రీ సర్వేతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని సర్పంచ్ కాళ్ల వెంకటగౌరీ లక్ష్మి తెలిపారు. సోమవారం వజ్రగడ గ్రామంలో డ్రోన్ సర్వేను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సర్వే ప్రారంభించిందన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

నాతవరం: భూ సర్వేకు రైతులు సహకరిస్తే సకాలంలో పూర్తి చేస్తామని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. వెదురుపల్లి పంచాయతీ శివారు కొడవలపూడి అగ్రహారంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా రెవెన్యూ గ్రామంలోని భూముల వివరాలను రైతులకు వివరించారు. భూ సర్వే విధి విధానాలపై అవగాహన కల్పించారు. రీసర్వే పూర్తయితే రైతులకు ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో సర్వే పూర్తి చేశామన్నారు. ఆర్ఐ నారాయణరావు, వీఆర్వో శాంతకుమారి, సచివాలయ సర్వేయర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

నాతవరం సభలో ఎమ్మెల్యే గణేష్



ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే గణేష్, పార్టీ శ్రేణులు



లయన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సన్యాసిపాత్రుడు

నాతవరం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా ఎన్నికల హామీలను 98 శాతం నెరవేర్చారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 9 వేల వరకు, నాతవరం మండలంలో 1,651 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరంతా ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు మొదట ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకులకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. బూత్‌ల వారీగా పార్టీ తరఫున ఇన్‌చార్జులు విధిగా ప్రతి ఓటరును కలిసి మనం చేసే కార్యక్రమాలు గురించి వివరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి సమాన ప్రాధాన్యం కల్పించారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ శెట్టి నూకరాజు, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, జి.వి.రెడ్డి, సోమన్నదొర, వేమల సూర్యనారాయణమూర్తి, మిరపల వెంకటరమణ, ఉలబాల శ్రీను, కాళ్ల సత్యనారాయణ, ఎంపీటీసీలు పోలుపర్తి వెంకటరమణ, తమరాన సత్యనారాయణ, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఏఎంసీ డైరెక్టరు నాయుడు, నాయకులు గడుపర్తి అచ్చియ్యనాయుడు, ఇట్టంశెట్టి శ్రీను, రెడ్డి సత్యనారాయణ, సిద్దాబత్తుల వెంకటరమణ, నూకాలమ్మ తల్లి ఆలయ కమిటీ ఛైర్మన్ అంకంరెడ్డి వెంకటరమణ, పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు చెక్కా జోగిరాజు, వర్తక సంఘం అధ్యక్షుడు తూతిక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలి

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు కోరారు. మేధావులు, విద్యావంతులైన లయన్స్ క్లబ్ ప్రతినిధులు డి.రాఘవేంద్రరావు, డాక్టర్ ఎ.గోపాలరావు, సిహెచ్.ఇందిర తదితరులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. క్లబ్ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో అన్ని క్లబ్‌లను కలిసి సుధాకర్ గెలుపునకు మద్దతు కూడగడుతున్నామన్నారు. క్లబ్‌ల ప్రతినిధులు, సభ్యులు సంపూర్ణ సహకారాన్ని అందించాలన్నారు.

వేలం పాట వాయిదా

మునగపాక: రామగిరి కోదండ సీతారాముల ఆలయ భూమి వేలం పాట వాయిదా పడిందని ఈవో పీఎస్ఏ మూర్తి తెలిపారు. సోమవారం జరగాల్సిన వేలం మరలా నిర్వహించే తేదీ వెల్లడిస్తామన్నారు.

సంగీతంపై విద్యార్థులు ఆసక్తి చూపాలి


అఖిల భారత నాయీబ్రాహ్మణ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు భవ్య



భవ్యను సత్కరిస్తున్న త్యాగరాజ వాయిద్య సంగీత కళాశాల ప్రతినిధులు

చోడవరం: సంగీతంపై విద్యార్థులు మరింత ఆసక్తి చూపాలని అఖిల భారత నాయీబ్రాహ్మణ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు దండ్లువాగు భవ్య అన్నారు. చోడవరం త్యాగరాజ వాయిద్య సంగీత కళాశాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కళాకారులకు ఉచితంగా సంగీతం నేర్పిస్తున్న త్యాగరాజ వాయిద్య సంగీత పాఠశాలకు గుర్తింపు వచ్చేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు సొంత భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు తమవంతు కృషి చేస్తానన్నారు. వాద్య కళాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు నానాజీని అభినందించారు. అనంతరం స్వయంభూ విఘ్నేశ్వస్వామిని దర్శించుకున్నారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ టీవీ రమణ, ప్రతినిధులు గుడివాడ సూరిబాబు, గొల్కొండ గోవింద, కొడమంచిలి జగదీష్ పాల్గొన్నారు.

కె.కోటపాడు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



దేవరాపల్లి నుంచి పయనమైన పార్టీ నేతలతో ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి: కె.కోటపాడులో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సారధ్యంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమీక్షకు దేవరాపల్లి మండలం నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల మండల కన్వీనర్ కె.వి. రమణ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, వరదపురెడ్డి లలితానాయుడు, వేచలపు అప్పలనాయడు, సచివాలయ కన్వీనర్లు రమాదేవి, మురళీ, ఆతవ మహేష్, తదితరులు వెళ్లారు.

కల్వర్టులు పునర్నిర్మించాలని ఆందోళన

చోడవరం రూరల్: చోడవరం నుంచి వెంకన్నపాలెం రహదారి మధ్యలో శిథిలావస్థకు చేరుకున్న ఇరుకు వంతెన (కల్వర్టు)లను తక్షణమే పునర్నిర్మించాలని సీపీఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గజపతినగరం సమీపంలోని ఇరుకు వంతెన వద్ద ఆందోళన చేపట్టారు. అనకాపల్లి జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ కల్వర్టుల వద్ద రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతినడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులకు ఏ మాత్రం చలనం లేకపోవడం శోచనీయమన్నారు. మండల శాఖ కార్యదర్శి నేమాల హరి, బొబ్బిలి శంకరరావు, దొడ్డి జగదీష్, ఉగ్గిన శివ, హనుమంతు, సబ్బవరపు గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ పాదాలు తీర్థానికి ఆహ్వానం



మాడుగుల: ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ నెల 5వ తేదీన జరగనున్న తీర్థం సందర్భంగా తారువ క్యాంపు కార్యాలయంలో గోడపత్రికను విడుదల చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కోట్ని సత్తింబాబు, పెచ్చేటి కొండలరావు, పుట్టా వెంకటేశ్వరరావు, శ్రీనాథు జగన్నాథరావు, యన్నంశెట్టి వెంకటరావు పాల్గొన్నారు.

నాటిక పోటీలకు ఏర్పాట్లు



నాటిక పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి రూరల్: మార్చి 20, 21, 22 తేదీల్లో అనకాపల్లిలో జ్యోతి సరళ స్మారక పరిషత్ నాటిక పోటీలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి పట్టణ సీపీఎం కార్యాలయంలో పరిషత్ నాటిక పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాటిక పోటీల కో-ఆర్డినేటర్ పీలా చిన్నమ్మనాయుడు మాట్లాడుతూ 1975 ఎస్ఎస్‌సీ బ్యాచ్ సహకారంతో నాటికల పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో బొప్పే ఉమామహేశ్వరరావు, రాపేటి నారాయణరావు, ఎవికే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.